Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు
# RAJADHANIVARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue) : 349 పేజీలు (Pages) : 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 4 - 6 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## గ్లోబల్ డిజిటల్ లీడర్‌గా భారత్ : కేంద్ర మంత్రి డా. పెమ్మసాని




**బ్రెజిలియా :** బ్రిక్స్ దేశాల మధ్య సైబర్ భద్రత మరింత బలోపేతం కావాలని కేంద్ర కమ్యూనికేషన్స్, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆకాంక్షించారు. స్టార్టప్ అభివృద్ధి, టెలీ కమ్యూనికేషన్స్, డేటా ప్రొటెక్షన్ చట్టం, డిజిటల్ స్కిల్స్ తదితర కార్యక్రమాలు భారత్‌ను గ్లోబల్ డిజిటల్ లీడర్‌గా నిలబెడుతున్నాయన్నారు. డిజిటల్ ప్రగతికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దూరదృష్టి, నాయకత్వమే కారణమని ఆయన స్పష్టం చేశారు. బ్రెజిల్ రాజధాని బ్రెజిలియాలో నిర్వహించిన 11వ బ్రిక్స్ కమ్యూ నికేషన్స్ మంత్రుల సమావేశంలో భారత తరపున ప్రతినిధిగా కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ హాజరయ్యారు. భారత్ దేశ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న డిజిటల్ మార్పు జరుగుతుందని ఆయన వివరించారు. డిజిటల్ సమావేశం ఒక జాతీయ లక్ష్యమే కాదన్నారు. అది ప్రపంచ అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఆ క్రమంలో ఆధార్, యూపీఐ తదితర అంశాల వల్ల భారత్‌లో ఎలా డిజిటల్ చైతన్యాన్ని సాధించాయనేది ఈ సందర్భంగా ఆయన సోదాహరణగా వివరించారు. ఆధార్ ద్వారా 95 కోట్ల మందికి పైగా ప్రజలకు భరోసా కలిగించే డిజిటల్ ఐడెంటిటీ లభించిందన్నారు. దీనివల్ల ప్రభుత్వ, ప్రైవేట్ సేవలకు మరింత సౌలభ్యమైందని చెప్పారు. యూపీఐ ద్వారా జరిగే డిజిటల్ చెల్లింపుల వల్ల ప్రపంచ డిజిటల్ లావాదేవీల్లో 46 శాతం వాటా భారత్‌దేనని గుర్తు చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ఒక స్థిరమైన, అంచనా వేయదగిన డిజిటల్ వ్యవస్థను నిర్మించిందని వివరించారు. అలాగే బ్రిక్స్ దేశాల మధ్య డీపీఐ సహకారం పెంచుకోవాల్సి ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్థిక సమావేశం, ప్రభావంతమైన పాలనకు డీపీఐ ఒక కీలక సాధనమని పేర్కొన్నారు. ఇక టెలికం మోసాలను ఎదుర్కొనే సంచార్ సాథీ కార్యక్రమం గురించి మంత్రి డాక్టర్ పెమ్మసాని సోదాహరణగా వివరించారు.

## ట్రంప్ ఫోన్‌తో మోదీ సరెండర్.. కాల్పుల విరమణపై రాహుల్ కీలక వ్యాఖ్యలు



**భోపాల్:** ఆపరేషన్ సింధూర్ కొనసాగుతున్న సమయంలో కాల్పుల విరమణకు అంగీకరించడంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి ఫోన్‌కాల్ రాగానే ప్రధాన నరేంద్ర మోదీ సరెండర్ అయ్యారని ఆరోపించారు. భోపాల్‌లోని రవీంద్ర భవన్‌లో మంగళ వారంనాడు జరిగిన పార్టీ సదస్సులో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, బీజేపీ-ఆర్ఎస్ఎస్ నేతలపై చిన్న ఒత్తిడి వచ్చినా సరే భయపడి పారిపోతారని అన్నారు. 'ట్రంప్ అక్కడి నుంచి ఫోన్ చేసి నరేందర్...సరెండర్ అన్నారు. ఇక్కడ నరేంద్ర మోదీ 'యస్ సర్' అనేశారు' అని రాహుల్ తెలిపారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 1971 సంక్షోభంలో నిర్ణయాత్మక వైఖరి ప్రదర్శించారని రాహుల్ గుర్తుచేశారు. 1971లో అమెరికా సెవెన్త్ ఫ్లీట్ వచ్చినప్పుడు, నేను ఏమి చేయాలో అది చేస్తానంటూ ఇందిరాగాంధీ చెప్పారని అన్నారు. కానీ ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతలకు మాత్రం ఇండిపెండెన్స్ సమయం నుంచి లొంగుబాటు లేఖలు రాయడం అలవాటని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ లొంగిపోదని చెప్పారు. గాంధీ, నెహ్రూ, సర్దార్ పటేల్ లొంగిపోయే వ్యక్తులు కారని, సూపర్ పవర్‌లను ఎదిరించి పోరాటం చేశారని అన్నారు..

**అమెరికా మధ్యవర్తిత్వం ఉత్తదే: ఎంఈఏ**

కాగా, ఇండియా-పాక్ మధ్య కాల్పుల విరమణకు ఎవరూ మధ్యవర్తిత్వం చేయలేదని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇటీవల వివరణ ఇచ్చింది. ఇరుదేశాల డీజీఎంఏలు నేరుగా చర్చించి కాల్పుల విరమణకు నిర్ణయించినట్టు ఎంఈఏ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ చెప్పారు. ఆపరేషన్ సింధూర్ ప్రారంభించిన మే 7 నుంచి.. కాల్పుల విరమణ జరిగిన మే 10 వరకూ కేవలం మిలటరీ పరిస్థితిపైనే భారత్, అమెరికా మధ్య సంభాషణలు జరిగాయే కానీ, సుంకాల అశం ఎక్కడా ప్రస్తావనకు రాలేదన్నారు.

## లిక్కర్ స్కాం నిందితులకు మరోసారి బిగ్ షాక్



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఏపీ లిక్కర్ స్కాం కేసులో నిందితుల రిమాండ్‌ను విజయవాడ కోర్టు పొడిగించింది. ఈ కేసులో ఏడుగురు నిందితుల రిమాండ్ ఈరోజుతో (మంగళవారం) ముగిసింది. దీంతో రాజ్ కసిరెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, చాణక్య, దిలీప్, ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్పలను సిట్ అధికారులు కోర్టులో హాజరుపర్చారు. దీంతో ఏడుగురు నిందితులకు ఈనెల 17 వరకు రిమాండ్ పొడిగిస్తూ విజయవాడ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

**ఇంత మంది అవసరమా.. జడ్జి కీలక వ్యాఖ్యలు**

అయితే లిక్కర్ కేసు నిందితుల రిమాండ్ పొడిగింపు సమయంలో సీబీఐ కోర్టు న్యాయాధికారి కీలక వ్యాఖ్యలు చేశారు. రిమాండ్ పొడిగింపునకు ఇంతమంది అవసరమా అంటూ డిఫెన్స్ న్యాయ వాదులను న్యాయమూర్తి ప్రశ్నించారు. కోర్టుకు వచ్చిన నిందితుల కోసం వారి కుటుంబ సభ్యులు, వైసీపీ నాయకులు తరలివచ్చారు. నిందితులను కోర్టులో హాజరుపరచగానే వీరంతా కూడా లోపలకు ప్రవేశించారు. ఈ క్రమంలో న్యాయమూర్తి ఘాటుగా స్పందించారు. సాఫీగా రిమాండ్ పొడిగింపు జరిగే దాని కోసం ఇంత హడావిడి అవసరమా అంటూ ప్రశ్నించారు. ఇదే జరిగితే ఇప్పటి వరకు తెరిచి ఉన్న తలుపులు మూసుకుపోతాయంటూ సీబీఐ కోర్టు న్యాయాధికారి వ్యాఖ్యానించారు. ఇక.. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే అరెస్ట్ చేసిన ఏడుగురు నిందితులను కూడా పలు దఫాలుగా కస్టడీలోకి తీసుకుని విచారించింది సిట్. ఈ కేసులో ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి మొదట వారం రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించారు సిట్ అధికారులు. అనంతరం జగన్ మోహన్ రెడ్డి అత్యంత సన్నిహితంగా వెలిగిన ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలను సిట్ ఆఫీసర్స్ అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో ఈ ముగ్గురితో పాటు మరోసారి కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డిని కస్టడీకి ఇవ్వాలని కోర్టులో పిటిషన్ వేశారు. ఇందుకు కోర్టుకు కూడా అనుమతించింది. నలుగురు నిందితులను రెండు రోజుల పాటు సిట్ అధికారులు కస్టడీలోకి తీసుకుని పలు దఫాలుగా విచారించారు. ఈ నలుగురు చుట్టూనే మద్యం వ్యవహారం మొత్తం నడిచినట్లు ఇప్పటికే సిట్ అధికారులు నిర్ధారణకు వచ్చారు. ఎలా విచారణ చేసినా, ఏ వైపు నుంచి మొదలు పెట్టినా కూడా మద్యం కుంభకోణంలో ప్రధానంగా వీరి పాత్ర ఉన్నట్లు చెబుతున్నారు. వీరి వెనక ఉన్న అసలు బాస్ ఎవరున్నారనే దానిపై నిర్ధారణకు వచ్చిన సిట్... అతనికి సంబంధించిన వివరాలను సేకరించే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో మరో వారం పది రోజుల్లోనే మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి మరిన్ని అరెస్ట్ జరిగే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం వీరి రిమాండ్ ముగియడంతో కోర్టులో హాజరుపర్చగా.. 17 వరకు రిమాండ్ పొడిగిస్తూ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో ఈ ఏడుగురు నిందితులను సిట్ అధికారులు తిరిగి విజయవాడ జిల్లా జైలుకు తరలించారు.

## అరాచకాలు చేసిన వారికి జగన్ మద్దతివ్వడం దారుణం

### - ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు



**అమరావతి, (రాజధాని వార్తలు):** గంజాయి బ్యాచ్‌కు మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సానుభూతి పలకడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అన్నారు. అరాచకాలు చేసినవారికి జగన్ మద్దతివ్వడం దారుణమని చెప్పారు. డాక్టర్ సుధాకర్‌ను జగన్ ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. తనకు ఓటేయని ప్రజలపై వైసీపీ వెన్నుపోటు దినోత్సవం చేస్తోందని ధ్వజమెత్తారు. ఇవాళ(మంగళవారం) అమరావతిలో రఘురామ పర్యటించారు. హెల్త్ కార్డ్ కోసం కొంతమంది నకిలీ ధ్రువపత్రాలు ఇచ్చి మరి తెల్లరేషన్ కార్డు తీసుకుంటున్నారని.. అలా చేయొద్దని రఘురామ కృష్ణంరాజు కోరారు. హెల్త్ కార్డ్ ఉన్న ప్రతి పౌరుడికి రూ. 25 లక్షలు కవరయ్యేలా చూడాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోందని రఘురామకృష్ణంరాజు చెప్పారు. ముందు తమ కమిటీ రిపోర్ట్‌ని అసెంబ్లీ స్పీకర్‌కు ఇస్తామని వెల్లడించారు. అవసరం లేకుండా కొంతమంది రేషన్ తీసుకోవడం వల్లే బియ్యం స్మగ్లింగ్ జరుగుతుందని అన్నారు. ఇప్పుడు కోటి 40 లక్షలు మందికి తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని వివరించారు. ఏపీలో మొత్తం కోటి 70 లక్షల కుటుంబాల్లో.. కోటి 40 లక్షలు బీపీఎల్ కిందే ఉన్నారనే విషయాన్ని నమ్మడం కష్టమని అన్నారు. రేషన్ అవసరం లేని వారు స్వచ్ఛందంగా ముందుకు వస్తే వారికి హెల్త్‌కార్డ్‌లో భాగంగా రూ. 25 లక్షలు కవరయ్యేలా చేస్తామని వివరించారు రఘురామ కృష్ణంరాజు. ఏపీ ప్రభుత్వం రేషన్‌కు రూ.5, 100 కోట్లు ఇస్తోందని.. ఇందులో రూ. 2000 కోట్లు రేషన్‌లో మిగిలితే ఆ మొత్తం విద్యాశాఖకు ఖర్చు పెడితే నాణ్యమైన విద్యా లభిస్తుందని రఘు రామకృష్ణంరాజు వ్యాఖ్యానించారు. హెల్త్ కార్డ్, రేషన్ కార్డు, పెన్షన్ కార్డులను వేర్వేరుగా ఇస్తే ఎలా ఉంటుందనే విషయాన్ని తమ కమిటీ ఆలోచించిందని చెప్పారు. ఈ విషయాన్ని అసెంబ్లీ స్పీకర్ ద్వారా ఏపీ ప్రభుత్వానికి అందించాలని నిర్ణయించామని తెలిపారు. 15 రోజులకు ఒకసారి తమ కమిటీ సమావేశం అవ్వాలని నిర్ణయించామని చెప్పారు. గత జగన్ ప్రభుత్వంలో పిటీషన్ కమిటీ ఒక్కసారి కూడా సమావేశం కాలేదని అన్నారు. రేషన్ అవసరం లేకపోతే ఆ మేరకు నగదు బదిలీపై చర్చిస్తున్నామని తెలిపారు. కోటి 46 లక్షల రేషన్ కార్డులకు నగదు ఇస్తే ధాన్యం ఎవరు కొంటారని ప్రశ్నించారు. బియ్యం ఇవ్వకుండా డబ్బులు ఇస్తే ధాన్యం కొనరా అని అడిగారు. రేషన్ షాప్‌లో రేషన్ మాత్రమే కాకుండా అన్ని ప్రొవిజన్‌లు ఉండేలా చూసే ఆలోచన కూడా ఉందని అన్నారు. ఇప్పుడు అవసరం ఉన్న వారికి రేషన్ ఇంటి డెలివరీ అవుతుందని రఘురామకృష్ణంరాజు పేర్కొన్నారు.

## శర్మిష్ఠ పనోలికి బెయిల్ నిరాకరించిన కోల్‌కతా హైకోర్టు



**కోల్‌కతా:** ఆపరేషన్ సిందూర్ సమయంలో అభ్యంతరకర వ్యాఖ్యలతో వీడియో పోస్ట్ చేశారన్న ఆరోపణలపై అరెస్టయిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ శర్మిష్ఠ పనోలికి కోల్‌కతా హైకోర్టులో చుక్కెదురైంది. ఆమెకు బెయిల్ ఇచ్చేందుకు మంగళవారం నాడు హైకోర్టు నిరాకరించింది. ఈ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భావ ప్రకటనా స్వేచ్ఛకూ ఒక పరిమితి ఉంటుందని.. వ్యక్తులు, మతపరమైన భావోద్వేగాలను గాయపరచరాదని పేర్కొంది. 'మనకు భావ ప్రకటనా స్వేచ్ఛ ఉంది. అంటే దాని అర్థం ఇతరుల మనోభావాలను గాయపరచమని కాదు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశం మనది. వివిధ భాషలు, కులాలు, మతాలు ఉన్నాయి. ఎవరినీ కించపరిచేలా మాట్లాడకూడదు. సోషల్ మీడియాలో వీడియో వచ్చినట్టు, ఒక వర్గం ప్రజల మనోభావాలను గాయపరిచినట్టు విన్నాం' అని జస్టిస్ పార్థసారథి చటర్జీ పేర్కొన్నారు. ఈ మేరకు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరించారు. పుణేకు చెందిన 22 ఏళ్ల న్యాయ విద్యార్థిని షర్మిష్ఠ పనోలి మే 14న ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఒక మతాన్ని కించపరచేలా వ్యాఖ్యలు చేశారంటూ విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఆ వీడియోను ఆమె తొలగించడంతోపాటు క్షమాపణలు కూడా తెలియజేశారు. అయితే ఆమెను అరెస్టు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్లు రావడంతో కోల్‌కతా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి గత శుక్రవారంనాడు గురుగావ్‌లో అరెస్టు చేశారు. కోర్టులో హాజరు పరచడంతో 14 రోజుల జ్యుడిషి యల్ కస్టడీ విధించింది. కాగా పనోలీ, ఆమె కుటుంబసభ్యులకు లీగల్ నోటీసులు ఇచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ వారు పరారీలో ఉండటంతో సాధ్యం కాలేదని, దీంతో కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసిందని కోల్‌కతా పోలీసులు తెలిపారు. అయితే అలిపూర్ ఉమెన్స్ కరెక్షనల్ హోంలో అపరిశుభ్ర వాతావరణం, మెడికల్ కేర్ లేనందున పనోలీ ఆరోగ్యం క్షీణించినట్టు ఆమె తరపు లాయర్ ఎండీ సమీముద్దీన్ మీడియాకు తెలిపారు.

## కొవిడ్ పరీక్షల సామర్థ్యం పెంచండి

### - ప్రతిరోజు వెయ్యి మందికి పరీక్షలు జరిపే స్థాయికి రావాలి : స్పెషల్ సీఎస్ కృష్ణబాబు ఆదేశాలు



**అమరావతి, (రాజధాని వార్తలు):** దేశవ్యాప్తంగా కేసులు పెరుగుతున్న దృష్ట్యా కొవిడ్ పరీక్షల సామర్థ్యాన్ని పెంచాలని ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు అధికారులను ఆదేశించారు. రోజుకు వెయ్యి మందికి కొవిడ్ పరీక్షలు చేసేస్థాయిలో ఏర్పాట్లు ఉండాలని కోరారు. సోమవారం ఆయన సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో తక్కువ స్థాయిలో కొవిడ్ కేసులు నమోదవుతున్నాయని, జ్వరం వంటి రోగ లక్షణాలతో ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్న వారికి కొవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. కొవిడ్ పరీక్షలు చేయడానికి అవసరమయ్యే వీటీఎం, ఆర్ఎన్ఏ, ఆర్‌టీపీసీఆర్ కిట్ల లభ్యతపై కృష్ణబాబు వాకబు చేశారు. పాత జీజీహెచ్‌ల్లో (గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్) రోజుకు వంద చొప్పున, కొత్త జీజీహెచ్‌ల్లో రోజుకు 50 చొప్పున పరీక్షలు చేసేందుకు అవసరమైన కిట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. నెల రోజులకు అవసరమయ్యే కిట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో రెండు లక్షలకు పైగా పీపీఈ కిట్లు, 60 వేలకు పైగా వీటీఎం కిట్లు ఉన్నాయని, ఆస్పత్రుల అవసరాల మేరకు వాటిని అందించాలన్నారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ కమిషనర్ జి.వీరపాండియన్, ఎండీ వి.గిరీశ, డీఎంఈ డాక్టర్ నరసింహం, సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సిరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# యోగా ప్రతి ఒక్కరి జీవన విధానంలో భాగం కావాలి

## - ఆరోగ్య, ఆనంద, స్వర్ణాంధ్ర సాకారమే యోగాంధ్ర-2025 అంతిమ లక్ష్యం : రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రాపురం, (రాజధాని వార్తలు):** ఆరోగ్య, ఆనంద స్వర్ణాంధ్ర సాకారమే యోగాంధ్ర-2025 కార్యక్రమ అంతి లక్ష్యమని, ఈ లక్ష్య సాధనకై యోగా ప్రతి ఒక్కరి జీవన విధానంలో భాగం అయ్యేలా ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రామచంద్రపురంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు డిగ్రీ కళాశాలలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో మంత్రి సుభాష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షకు అనుగుణంగా ఆరోగ్య, ఆనంద, స్వర్ణాంధ్ర సాకారానికై ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యోగాంధ్ర కార్యక్రమాన్ని మంచి స్ఫూర్తితో ముందుకు తీసుకు వెళ్లేందుకు అధికారులు, యువత, ప్రజలంతా సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ విశాఖపట్నం వేదికగా జూన్ 21న జరుగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో



భారత ప్రధాన మంత్రి నరేంద్ర మెడీ పాల్గొంటున్న సందర్భంగా ప్రపంచానికి యోగ విశిష్టతను తెలియపర్చడమే కాకుండా యోగాంధ్రప్రదేశ్‌గా ప్రపంచంలో రాష్ట్రానికి మంచి గుర్తింపు తెచ్చే విధంగా ఏర్పాట్లు, కార్యక్రమ నిర్వహణ ఉండాలని, అందకు




తగ్గట్టుగా తగు ముందస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో యోగాంధ్ర కార్యక్రమాలను నెల రోజుల పాటు నిర్వహించి తద్వారా ప్రజల ఆరోగ్యాన్ని, ఆనందాన్ని పరిరక్షించే విధంగా చైతన్య పర్చేందుకు కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామన్నారు. దీనికి అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాలు, గ్రామాల్లో పండుగ వాతావరణంలో యోగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. సుమారు 2 కోట్ల మంది ప్రజలకు యోగా శిక్షణను ఇచ్చేందుకు 1.25 లక్షల మంది శిక్షకులుగా తీర్చిదిద్దే కార్యక్రమం సాగుతుందన్నారు. యోగా కోసం 2 కోట్ల మంది ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులు అయ్యే విధంగా రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించగా ఆ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

యోగా ద్వారా మానసిక ప్రశాంతత, ఒత్తిడిని జయించడం, శాంతి, సామరస్యంలాంటి విలువలతో సంపూర్ణ మానవులుగా ఎదగడానికి యోగ సాధన ఒక దిక్సూచిలా సహాయపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ జిల్లా ఓఎన్‌జిసి మత్స్యకార బాధ్యతలు నష్టపరిహారం తక్షణమే అమలు చేయాలి : కూటమి ప్రభుత్వం

**కాకినాడ సిటీ, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లాలో ఉన్న రిలయన్స్, ఓ.ఎన్.జి.సి,ఎస్.ఆర్. గుజరాత్, దివీస్, అరబిందో, కాకినాడలో ఉన్న ఆయిల్ ఫ్యాక్టరీలు, ఎన్.ఎఫ్.సి.ఎల్, కోరమాండల్, షుగర్ ఫ్యాక్టరీల నుండి వచ్చే కెమికల్ వాటర్, క్రూడ్ ఆయిల్ సముద్రపు అడుగు భాగంలో సుమారు 100 నుండి 200 కిలోమీటర్ల మేర వ్యాపించడం వలన మత్స్యసంపద కోల్పోయి నష్టపోతున్నాం. అయ్యా మేము పై ఫ్యాక్టరీలు అన్నింటికీ వ్యతిరేఖం కాదు. మా బ్రతుకు తెరువు పోతుంది. మాకు సముద్రం తప్పితే మరే ఇతర భూమి గానీ, వ్యాపారం గానీ లేవు. ఈ ఫ్యాక్టరీల మధ్య మా జీవితాలు నలిగిపోతూ జీవనం సాగిస్తున్నాము. ఈ క్రింది ఐదు విన్నపాలు మీ ద్వారా నెరవేర్చినట్లైతే మా భావితరాల పిల్లల భవిష్యత్ నిలబడుతుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేసి మా ఐదు విన్నపాలు నెరవేరుస్తాని కోరిప్రార్ధిస్తున్నాము. 1. కాకినాడ జిల్లాలో వున్న మత్స్యకారులకు గ్యాస్, కెమికల్, ఆయిల్, క్రూడ్ ఆయిల్ వలన సముద్రం అడుగుభాగంలో సుమారు 100 నుంచి 200 కిలో మీటర్ల దూరం వరకు చేపలు పడే పరిస్థితి లేదు. అందువల్ల ముమ్మిడివరం, యానాం నియోజకవర్గాల్లో మత్స్యకారులకు ప్రతీ




నెల ఏవిధంగా రూ. 11,500/-లు ఇస్తున్నారో అదేవిధంగా కాకినాడ 1,2. యుకొత్తపల్లి, తొండంగి మండలాల్లో ఉన్న మత్స్యకారులకు రూ. 11,500/-లు ఇవ్వాలి. 2. సముద్రాన్ని నముకొన్ని చేపలు వేటాడి జీవనం సాగించే మత్స్యకారులకు వేట సమయంలో తుఫాన్ వలన గానీ, వేటాడే సమయంలో గానీ, బోట్‌పై గానీ, రోడ్డుపై గానీ, అనుకోని సంఘ టన వల్ల ఏమైనా ప్రమాదం జరిగితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50 లక్షలు జనరల్ ఇన్సూరెన్సు ఇవ్వాలి. 3. కాకినాడ జిల్లా సముద్ర తీరంలో వున్న ఫ్యాక్టరీలలో ఓ.ఎన్.జి.సి, ఎస్.ఆర్.గుజరాత్, ఎన్.ఎఫ్.సి. ఎల్, కోరమాండల్, షుగర్, ఆయిల్, దివీస్, అరబిందో ఫ్యాక్టరీలలో వెస్ట్ బెంగాల్, బీహార్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు పనిచేస్తున్నారు. ఈ కంపెనీల వలన సముద్రంలో మత్స్య సంపద కోల్పోతున్న మత్స్యకారులకు పై అన్ని కంపెనీలలో నూటికి 20 శాతం ఉద్యోగ అవకాశం కల్పించాలి. 4. కాకినాడ జిల్లాలో ఉన్న మత్స్యకారులు అవసరాల నిమిత్తము 5 రూపాయలు, 10 రూపాయలకు వడ్డీలకు డబ్బులు తీసుకొని దళారీల చేతిలో మోస పోతున్నాం. అందువల్ల సముద్రంలో వేటాడే మత్స్యకారులను రైతులుగా గుర్తించి కాకినాడ జిల్లా డి.సి.సి బ్యాంకు ద్వారాగా వారికీ కూడా 1లక్ష నుండి 5 లక్షల వరకు రుణాలు మంజూరు చెయ్యాలి. 5. కాకినాడ జిల్లాలో వున్న అన్ని కంపెనీల నుండి వస్తున్న సి.ఎస్.ఆర్. నిధులు మత్యకార కుటుంబాలలో వున్నా యువతీ యువకుల అభివృద్ధికి ఉపయోగించాలని కోరుతున్నాము.

**సంఘ నాయకులు**

కాకినాడ సిటీ, కాకినాడ రూరల్ నియోజకవర్గాలు :- 1. ఉప్పలంక 2. ఉప్పలంక మొండి 3. దొడ్లగాడ (పాత బస్టాండ్) 4. పగడాలపేట 5. డ్రైవర్ కాలనీ 6. మహాలక్ష్మీ నగర్ 7. ముత్తానగర్ 8. గోళీలపేట 9. ఏటిమొగ 10. పప్పులమిల్లి 11. రాఘవేంద్రపురం 12. సూర్యారావుపేట (లైట్ హౌస్) 13. కొండేలపేట 14. గొడారిగుంట మత్స్యకార కోలనీ 1 15. గొడారిగుంట మత్స్యకార కోలనీ 2 16. బొందగుంట 17. నాగరాజుపేట 18. పాత బస్టాండ్ 19. పర్లోవపేట 20. దుమ్ములపేట 21. కొత్తకాకినాడ 22. ఫిషింగ్ హార్బర్ 23. వాకలపూడి 24. పోలవరం 25. నేమాం... పితాపురం నియోజకవర్గం :- 1. ఉప్పాడ 2. సుబ్బంపేట 3. కొత్త మాయా పట్నం 4. కొత్త సూరాడపేట 5. పల్లిపేట 6. రంగంపేట 7. కొత్తపేట 8. రామచిట్టిపేట 9. జగ్గరాజుపేట 10. సూరాడపేట 11. మాయాపట్నం 12. అమీనాబాద్ 13. క్రీస్తునగరం 14. కృపానగరం 15. సాయినగరం 16. ఎస్సీపేట 17. మాదిగపేట 18. మూలపేట 19. పైవూరు 20. కిందవూరు 21. కొత్తపేట 22. కోనపాపపేట 23. బోగుపేట 24. యాచరీ వెనకాలవూరు 25. కుప్పులోలువూరు 26. కొత్తపేట 27. కొత్త కోలనీ 28. పాత కోలని.. తుని నియోజకవర్గం :- 1. హక్కంపేట 2. ఎల్లయ్యపేట 3. నర్సిపేట 4. పంపాదిపేట 5. చోడిపల్లిపేట 6. కొత్త చోడిపల్లిపేట 7. పెనుమాళ్లపురం 8. దానవాయిపేట 9. అద్దిరిపేట 10. ఎర్రయ్యపేట 11. కొత్తపేట 12. అన్నయ్యపేట.

# మీకు అండగా ఉంటాం : మల్లాడి రాంబాబు

**తాళ్ళరేవు, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం చిన్న వలసల గ్రామంలో కరెంటు షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నికి ఆహుతైన మల్లాడి రాంబాబు తాటాకు ఇల్లు అగ్నికి దగ్ధం కాగా వస్తువులన్నీ పూర్తిగా కాలిపోవడంతో నిరాశ్యులైన రాంబాబు కుటుంబ సభ్యులకు మేమందరం మీకు అండగా వున్నాము అని ధైర్యం చెప్పి నిత్యవసర వస్తువులు, వంట పాత్రలు, నూతన వస్త్రాలు, పది వేల రూపాయలు ఆర్థిక సహాయం అందచేసిన యానాం యాన్ ఆర్ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లాడి సామ్యూల్, సావిత్రి నగర్ యువత అధ్యక్షులు మల్లాడి రాజు, విజయలక్ష్మి



క్యాటరింగ్ ఓనర్ శేషు, ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

# పిల్లలను ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలి

## - పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి మల్లాడి కృష్ణారావు




**యానాం, (రాజధాని వార్తలు):** ప్రతి ఒక్కరు ప్రభుత్వ కళాశాలలో తమ పిల్లలను చేర్పించాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. సోమవారం స్థానిక టంగుటూరి ప్రకాశం పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెలవుల తర్వాత విద్యాలయం పునః ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని అధ్యాపకులు, విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాలయాలలో ప్రభుత్వం అన్ని సదుపాయాలను ఏర్పాటు చేస్తుందన్నారు. ఆ సదుపాయాలను తల్లితండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనవసరంగా ప్రైవేట్ కళాశాలలో తమ పిల్లలను చేర్పించి తల్లితండ్రులు ఇబ్బంది పడవద్దని అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు, రక్ష హరికృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవసరమైన ఏర్పాట్లు గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకి ఎటువంటి ఇబ్బంది లేకుండా కావలసిన అన్ని సదుపాయాలను సమకూర్చాలని సూచించారు. 2025-26 విద్యా సంవత్సరంలో మరింత ఉత్తమ ఫలితాలు తీసుకువచ్చే విధంగా అధ్యాపక బృందం కృషి చేయాలని కోరారు. ముందుగా సరస్వతి దేవి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో వైస్ ప్రిన్సిపాల్ జి రత్నప్రభ, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఈఏపిసెట్ వెబ్‌సైట్‌లో ఏపి, తెలంగాణ ఇంటర్మీడియట్ రెగ్యులర్ విద్యార్థుల గ్రూప్ మార్కులు

**కాకినాడ, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ & ఫార్మశీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపి ఈఏపి సెట్) - 2025 ప్రవేశ పరీక్షకు సంబంధించి ర్యాంకుల కేటాయింపునకు ఇంట ర్మీడియట్ గ్రూప్ మార్కుల నుండి 25% వెయిటేజీ ఉన్నందున పరీక్షకు హాజరైన విద్యార్థులు తమ ఇంటర్మీడియట్ గ్రూప్ మార్కు లను ఏపి ఈఏపిసెట్-2025 వెబ్సైట్లోని డిక్లరేషన్ ఫారం ద్వారా పరిశీలించుకోవాల్సిందిగా ఏపి ఈఏపిసెట్ ఛైర్మన్ మరియు ఉపకులపతి ప్రొ.సిఎస్‌ఆర్ కె.ప్రసాద్ తెలిపారు. ఏపి ఈఏపిసెట్-2025 ప్రవేశ పరీక్షకు సంబంధించి 25% వెయిటేజీ మార్కులను ఇంటర్మీడియట్ గ్రూప్ మార్కుల ఆధారంగా తీసుకుంటున్న దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ ఇంటర్మీడియట్ రెగ్యులర్ విద్యార్థుల గ్రూప్ మార్కులను ఈఏపిసెట్ వెబ్సైట్లో పొందుపర్చడం జరిగిందని, ఏపి మరియు తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డులు కాకుండా అందుబాటులో లేని ఐసిఎస్‌ఈ, సిబిఎస్‌ఈ, ఏపిఓఎస్ ఎస్, ఎన్ఎస్ఐఓఎస్, ఆర్డియుకేటి, డిప్లమో మరియు ఇతర బోర్డులకు చెందిన విద్యార్థుల 10+2 గ్రూప్ మార్కులను ఏపి ఈఏపిసెట్-2025 వెబ్సైట్ https://cets.apsche.ap. gov.in ద్వారా డిక్లరేషన్ ఫారంలో అప్లోడ్ చేయవలసి ఉంటుం దని, తద్వారా వారికి ర్యాంకులు కేటాయించడం జరుగుతుందని కన్వీనర్ ప్రొ.వి.వి. సుబ్బారావు తెలిపారు. డిక్లరేషన్ ఫారంలో అందుబాటులో ఉన్న ఇంటర్మీడియట్ రెగ్యులర్ మరియు ఇతర బోర్డుల విద్యార్థులకు సంబంధించిన గ్రూప్ మార్కులలో ఎటు వంటి తప్పిదాలు ఉన్నా త్వరితగతిన 0884-2359599, 0884-2342499 ఫోన్ నెంబర్ల ద్వారా గాని, helpdeskapeapcet@apsche.org మెయిల్ ఐడి ద్వారా గాని సంప్రదించి ఇంటర్మీడియట్ మార్కులను మెయిల్ ద్వారా అందజేయాలని కన్వీనర్ సూచించారు. అలాగే 10+2 గ్రూప్ మార్కులను డిక్లరేషన్ ఫారం ద్వారా అప్లోడ్ చేయని వారు, గ్రూప్ మార్కులలో తప్పిదాలు ఉన్న విద్యార్థులకు ఈనెల 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సవరించుకు నేందుకు అవకాశం కల్పించినట్లు కన్వీనర్ ప్రొ.వి.వి.సుబ్బారావు తెలిపారు.

# వేసవి విజ్ఞాన తరగతులు కార్యక్రమాల్లో భాగంగా డ్రాయింగ్ పోటీలు






**కాకినాడ, (రాజధాని వార్తలు):** పౌర గ్రంథాలయ శాఖా సంచాలకుల వారి ఆదేశములు మరియు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వారి ఉత్తర్వులు ప్రకారం జిల్లా కేంద్ర గ్రంథాలయం, కాకినాడలో ది. 02/06/2025వ తేదీన వేసవి విజ్ఞాన తరగతులు కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్వర్ణాంధ్ర విజన్ 2047, స్వచ్ఛ భారత్ అనే అంశాలపై డ్రాయింగ్ పోటీలు ప్రముఖ చిత్రకారులు డ్రాయింగ్ ఉపాధ్యాయులు చినబాబు పర్యవేక్షణలో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని, విద్యార్థులచే ఉదయం 8 గం.ల నుండి 8:30 గం.ల వరకు పుస్తక పఠనం కార్యక్రమం నిర్వహించడం జరిగినది. 8:30 గం.ల నుండి 9:15 గం.ల వరకు డిఆర్‌డిఏ శిక్షణా నిపుణులు సత్య బాల విద్యార్థులకు కమ్యూనికేషన్స్ స్కిల్స్‌పై శిక్షణ ఇవ్వడం జరిగింది. 9:15 గం.ల నుండి 10:00 గం.ల వరకు విశ్రాంత ఉపాధ్యాయులు సూర్యనారాయణ విద్యార్థులకు ఓరిగామి మరియు పేపర్ క్రాఫ్ట్‌పై శిక్షణ ఇవ్వడం జరిగింది. 10:00 గం.ల నుండి 10:10 గం.ల వరకు విద్యార్థినీ విద్యార్థులకు విరామం అల్పాహారం పంపిణీ చేయడం జరిగినది. 10:10 గం.ల నుండి 11:00 గం.ల వరకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయ అధికారి ఇన్‌ఛార్జ్ కిషోర్ జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది రాజు, నాగేంద్ర కుమార్, వీర్రాజు, అరుణ, ప్రియదర్శిని మరియు స్థానిక పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు 55 మంది పాల్గొనడం జరిగినది.

# రేషన్ బియ్యం అందజేసిన ధూళిపూడి



**తాళ్ళరేవు, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పి.మల్లవరం, పత్తిగొంది గ్రామాల్లో కూటమి ప్రభుత్వం ఆలోచన మేరకు రేషన్ షాపులను ఈరోజు పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ (బాబి) మాట్లాడుతూ గత వైయస్సార్ ప్రభుత్వంలో రేషన్ బియ్యం అధిక శాతం స్మగ్లింగ్ ద్వారా షిప్‌లో ద్వారా విదేశాలకు తరలించిన సంగతి అందరికి తెలిసిందే. మరియు వ్యాన్ ద్వారా ఇంటింటికీ బియ్యం పంపిణీ పేరుకే తప్పా ఏ ఇంటికి బియ్యం అందజేయలేదని, వ్యాన్ కోసం ఎదురు చూసే పరిస్థితి అన్నారు. ఈరోజు నుంచి అటువంటి ఇబ్బందులు లేకుండా 1వ తేదీ నుంచి 15 వ తేదీ వరకూ రెండు పూటలా రేషన్ ఇస్తారని కావునా ప్రజలు అందరూ వారికి వీలైన సమయంలో సరుకులు తీసుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెదేపా అధ్యక్షుడు గుత్తుల వెంకటరమణ, సర్పంచ్ పంపన రామకృష్ణ, యంపిటిసి నాగేంద్ర ప్రసాద్, విళ్ళ సత్యనారాయణ, వుంగరాల కృష్ణ, పితాని విష్ణు, దున్నా సుబ్రహ్మణ్యం, గౌతం, మోకన సుధాకర్, మొగలతుర్థ డీలర్లు అందే కాశీరాజు, ధూళి పూడి సత్యం తదితరులు పాల్గొన్నారు.

# 'కాంతార' ఫ్రాంచైజ్‌లో మరో సర్ ప్రైజ్!



'కాంతార' సినిమా 2022లో విడుదలై భారతీయ సినిమా ప్రేక్షకులను ఎంతగా ఆకర్షించిందో అందరికీ తెలిసిందే. రిషబ్ శెట్టి రచన, దర్శకత్వం, నటనలో హొంబలే ఫిల్మ్స్ నిర్మించిన ఈ కన్నడ చిత్రం, కర్ణాటకలోని దక్షిణ కన్నడ గ్రామంలో సాగే కథతో అందరి హృదయాలను గెలుచుకుంది. సప్తమి గౌడ, కిషోర్, అచ్యుత్ కుమార్ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమా, భూత కోలా సంప్రదాయాన్ని, ప్రకృతి మానవ సంఘర్షణను అద్భుతంగా చూపించింది. ఇక సినిమా పాన్ ఇండియా విజయంతో రూ. 400 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, 70వ జాతీయ అవార్డ్సులో రిషబ్ శెట్టికి ఉత్తమ నటుడు, సినిమాకు ఉత్తమ వినోదాత్మక చిత్రం అవార్డులను గెలుచుకుంది. 'కాంతార' విజయం తర్వాత, ఈ ఫ్రాంచైజ్‌లో రెండో సినిమాగా 'కాంతార: చాప్టర్ 1' రూపొందుతోంది. ఇది మొదటి సినిమాకు ప్రీక్వెల్‌గా, కదంబ రాజవంశం హయాంలో సాగే కథతో రిషబ్ శెట్టి మరోసారి దర్శకత్వం వహిస్తూ, నటిస్తున్నాడు. ఇక సినిమా అక్టోబర్ 2న విడుదల కానుంది, ఇది గాంధీ జయంతి, దసరా సందర్భంగా భారీ విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమాలో రిషబ్ శెట్టి నాగ సాధువుగా, అతీంద్రియ శక్తులతో కనిపించనున్నాడు, జయరామ్, కిషోర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సినిమా కోసం ఈ మధ్య 500 మంది ఫైటర్స్‌తో ఒక భారీ యుద్ధ సన్నివేశాన్ని చిత్రీకరించారు. లేటెస్ అప్డేట్ ప్రకారం, 'కాంతార' ఫ్రాంచైజ్‌లో మూడో సినిమా కూడా రానుంది. ఈ విషయాన్ని 'కాంతార: చాప్టర్ 1' విడుదల సమయంలో అధికారికంగా ప్రకటించనున్నారు. హొంబలే ఫిల్మ్స్ ఈ ఫ్రాంచైజ్‌ను మరింత విస్తరించే ఆలోచనలో ఉందని, మూడో సినిమా కథ కూడా కర్ణాటక సంప్రదాయాలు, ఆధ్యాత్మికత చుట్టూ సాగుతుందని టాక్ నడుస్తోంది. ఈ సినిమా కథ 'కాంతార' యూనివర్స్‌లోనే సాగుతూ, మరో కొత్త కోణాన్ని చూపించనుందని అంటున్నారు. మూడో సినిమా కోసం రిషబ్ శెట్టి దర్శకత్వం వహిస్తాడా లేక వేరే దర్శకుడిని ఎంచుకుంటారా అనేది ఇంకా తెలియరాలేదు. అయితే, ఈ ఫ్రాంచైజ్‌ను ఒక సినిమాటిక్ యూనివర్స్‌గా మార్చాలని హొంబలే ఫిల్మ్స్ భావిస్తోంది. 'కెజిఎఫ్' ఫ్రాంచైజ్‌తో సత్తా చాటిన ఈ నిర్మాణ సంస్థ, 'కాంతార'తో మరో భారీ విజయాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. 'కాంతార: చాప్టర్ 1' కోసం రిషబ్ శెట్టి కలరిపయట్టు, కత్తి పోరాటం, గుర్రపు స్వారీ వంటి శిక్షణలు తీసుకున్నాడు. ఈ సినిమా కుందాపురలోని కదంబ రాజవంశ సెట్‌లో చిత్రీకరణ జరుగుతోంది, ఇది ప్రేక్షకులను చారిత్రక కాలంలోకి తీసుకెళ్లనుంది. ఇక ఈ సినిమా కన్నడ, తెలుగు, తమిళ, హిందీ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్ భాషల్లో విడుదల కానుంది.

# రానా నాయుడు సీజన్2 ట్రైలర్.. మేకర్స్ జాగ్రత్త పడ్డట్టే ఉన్నారు




దగ్గుబాటి వెంకటేష్, రానా ప్రధాన పాత్రల్లో రూపొందిన వెబ్ సిరీస్ రానా నాయుడు ఎంత పెద్ద సక్సెస్ అయిందో తెలిసిందే. ఈ సిరీస్‌లో బోల్డ్ కంటెంట్ ఎక్కువైందనే కామెంట్స్ వినిపించినా ఆడియన్స్ మాత్రం ఈ సిరీస్‌ను విపరీతంగా ఆదరించారు. దీంతో రానా నాయుడు సిరీస్‌కు సీక్వెల్‌గా రానా నాయుడు సీజన్2ను తెరకెక్కించి దాన్ని రిలీజ్‌కు రెడీ చేశారు. రానా నాయుడు సీజన్2 మొదటి సీజన్‌ను మరిపిస్తుందని, ఈసారి యాక్షన్, డ్రామా ఎక్కువగా ఉండనుందని ఇప్పటికే వెంకటేష్ వెల్లడించాడు. రానా నాయుడు సీజన్2 జూన్ 13 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సీజన్ అందుబాటులోకి రానుండగా రీసెంట్‌గా నెట్‌ఫ్లిక్స్ రానా నాయుడు సీజన్2 ట్రైలర్‌ను రిలీజ్ చేసింది. మొదటి పార్ట్‌లో బోల్డ్ కంటెంట్ ఎక్కువగా ఉందని విమర్శలు వచ్చిన నేపథ్యంలో రానా నాయుడు2లో దాన్ని కాస్త తగ్గించినట్టు అనిపిస్తుంది. అంతేకాదు, తొలి సీజన్‌కు మించిన వినోదం, థ్రిల్ కూడా ఈ సీజన్‌లో ఉండనున్నాయని ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. నాగ నాయుడిగా వెంకటేష్ తన కుటుంబం కోసం ఎంత వరకైనా వెళ్లే వాడిగా అద్భుతమైన నటనను కనబరిచాడు. కరణ్ అన్షుమాన్, సుపర్ణ్ వర్మ, అభయ్ చోప్రా సంయుక్తంగా దర్శకత్వం వహించిన రానా నాయుడు సీజన్2 ను సుందర్ ఆరోన్, లోకోమోటివ్ గ్లోబల్ నిర్మించాయి. అర్జున్ రాంపాల్, సుర్వీన్ చావ్లా, కృతి కర్బంద, సుశాంత్ సింగ్, అభిషేక్ బెనర్జీ, డినోమోరియా ఈ సిరీస్‌లో కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాలో వెంకటేష్‌కు కొడుకుగా రానా కనిపించనున్నాడు. ట్రైలర్ చూస్తుంటే మొదటి సీజన్‌లో చేసిన పొరపాట్లను దృష్టిలో పెట్టుకుని ఈసారి టీమ్ కాస్త జాగ్రత్త పడినట్టు అనిపిస్తుంది.

# వాళ్లు బ్రెయిన్ వాష్ చేయడం వల్లే మళ్లీ ఇండస్ట్రీకి వచ్చా



చైల్డ్ ఆర్టిస్ట్ నిత్యా శెట్టి అందరికీ పరిచయస్తురాలే. కోడి రామకృష్ణ తెరకెక్కించిన దేవుళ్లు సినిమాలో బాల నటిగా నటించి ఎంతో మంచి ప్రశంసలు అందుకున్న నిత్యా ఆ తర్వాత లిటిల్ హార్ట్స్, దాగుడు మూతలు దండాకోర్ తో పాటూ పలు సినిమాల్లో నటించింది. ఆ తర్వాత హీరోయిన్‌గా మారి నువ్వు తోపురా, ఓ పిట్టకథ లాంటి సినిమాలు చేసింది. తెలుగులో పాటూ కోలీవుడ్‌లో కూడా నిత్యా సినిమాలు చేసింది. అక్కడ కూడా బాలనటిగా కొన్ని సినిమాలు చేసింది. చిన్నప్పుడు బాలనటిగా పలు సినిమాలు చేసిన నిత్యా ఆ తర్వాత చదువుల కోసం తన యాక్టింగ్ కెరీర్‌కు ఫుల్ స్టాప్ పెట్టింది. బాగా చదివి జాబ్ కూడా చేసిందట. ఈ విషయాన్ని స్వయంగా నిత్యా శెట్టి రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో బయటపెట్టింది. తాను చిన్నగా ఉన్నప్పుడు మొదట్లో డాక్టర్ అవాలనుకుందట నిత్యా. కానీ తన చుట్టాల్లో ఒక డాక్టర్ ఉన్నారట. అతను డాక్టర్ అంటే లైఫ్ లాంగ్ చదువుతూనే ఉండాలని చెప్పడంతో దాన్ని వదిలేసి బిటెక్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ చేశానని చెప్పింది. చదువయ్యాక కూడా తనకు యాక్టర్ అవ్వాలనే ఆసక్తి కానీ, ఆలోచన కానీ లేదని నిత్యా శెట్టి తెలిపింది. అందుకే స్టడీస్ అయిపోయాక ఇన్ఫోసిస్‌లో జాబ్ వస్తే మైసూర్ వెళ్లి జాబ్‌లో జాయిన్ అయ్యానని, జాబ్ చేస్తూనే ఇస్రో ఎగ్జామ్ కూడా రాసి పాసయ్యానని, ఇస్రోలో ఆఫర్ వస్తే వద్దనుకుని ఇన్ఫోసిస్‌లోనే ఉండిపోయానని, ఇన్ఫోసిస్‌లో ఎంప్లాయ్ అవార్డ్స్ కూడా అందుకున్నానని, అక్కడ ఆఫీస్‌లోని కొలీగ్స్ నువ్వు ఒకప్పుడు ఆర్టిస్టువి కదా సినిమాలు చేసుకోవచ్చు కదా అని బ్రెయిన్ వాష్ చేయడంతో జాబ్‌కు రిజైన్ చేసి ఇండస్ట్రీకి వచ్చానని చెప్పుకొచ్చింది నిత్యా.

# రూ.5 కోట్లు ఎక్కువ పెట్టి ఉంటే... సత్య సర్వనాశనం!






బాలీవుడ్‌లో ఎన్నో సూపర్ హిట్ సినిమాలను రూపొందించిన దర్శకుల్లో అనురాగ్ కశ్యప్, రామ్ గోపాల్ వర్మ ముందు ఉంటారు. వీరిద్దరూ ప్రస్తుతం బాలీవుడ్ సినిమాలకు దూరంగా ఉంటున్నారు. బాలీవుడ్ పై కోపంతో వీరిద్దరూ పూర్తిగా సౌత్ సినిమాలు చేస్తున్నారు. వీరు హిందీ సినిమాలతో దూరంగా ఉన్నప్పటికీ వీరికి బాలీవుడ్‌తో సన్నిహిత సంబంధాలు ఉంటాయి. అందుకే రెగ్యులర్‌గా బాలీవుడ్ మీడియాలో వీరిద్దరూ కనిపిస్తూ ఉన్నారు. ఎక్కువ శాతం వీరిద్దరు వేరు వేరుగా మీడియాలో హాట్ టాపిక్‌గా ఉంటారు. కానీ తాజాగా వీరిద్దరూ కలిసి ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఇద్దరు ఫైర్ బ్రాండ్ డైరెక్టర్స్ ఒకే ఇంటర్వ్యూలో కనిపించడంతో హాట్ టాపిక్‌గా మారింది. ఇండియా టీవీ ఫిల్మీ హస్టిల్‌లో అనురాగ్ కశ్యప్, రామ్ గోపాల్ వర్మ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా బాలీవుడ్‌లో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల గురించి వారు కామెంట్స్ చేశారు. హిట్ సినిమాలను ఎక్కువగా ఫాలో అవుతున్నారని, ఒక సినిమా హిట్ అయితే, అదే ఫార్ములాతో మరిన్ని సినిమాలను తీసుకురావడం, అదే జోనర్‌లో ఎక్కువ బడ్జెట్‌తో సినిమాను చేయడం వంటివి చేస్తున్నారు. తద్వారా సినిమాలు ఫ్లాప్ అవుతున్నాయని వీరిద్దరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా ట్రై చేయాలి అనుకునే వారికి బాలీవుడ్‌లో స్కోప్ లేకుండా పోయిందని, అన్ని చోట్ల కూడా ఏదో ఒక ఫార్ములాను తీసుకుని మేకింగ్ చేస్తున్నారని వీరు అన్నారు. రామ్ గోపాల్ వర్మ ఈ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... బాహుబలి సినిమా తర్వాత అన్ని భాషల ఫిల్మ్ మేకర్స్ భారీ బడ్జెట్ సినిమాలను నిర్మించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అంతేకాకుండా బాహుబలి తరహాలో భారీ వీఎఫ్ఎక్స్ వర్క్ ఉండే విధంగా స్క్రిప్ట్‌ను ఎంపిక చేస్తున్నారు. కథ అనుసారంగా కాకుండా ఇష్టానుసారంగా బడ్జెట్‌ను ఖర్చు చేయడం ద్వారా నిర్మాతలు ఇబ్బందులు పడే పరిస్థితి ఉంటుంది. అనవసరంగా వీఎఫ్ఎక్స్‌కి ఎక్కువ మొత్తంలో ఖర్చు చేస్తున్న వారు చాలా మంది ఉన్నారని వర్మ చెప్పుకొచ్చాడు. తాను చేసిన సత్య సినిమాకు మరో రూ.5 కోట్లు ఎక్కువ ఖర్చు చేసి ఉంటే కచ్చితంగా సినిమా ఫలితం అనేది సర్వనాశనం అయ్యే ఉండేదని వర్మ అన్నాడు. మరో దర్శకుడు అనురాగ్ కశ్యప్ మాట్లాడుతూ... ఇటీవల కాలంలో సినిమాల్లో హింసాత్మక సినిమాలు ఎక్కువ అవుతున్నాయి. యానిమల్ సినిమా విషయానికి వస్తే హింసాత్మక సన్నివేశాలు ఎక్కువగా ఉన్నాయి. రక్తపాతం సన్నివేశాలు శృతి మించి ఉన్నాయి. యానిమల్ సినిమాకు యాక్షన్ సన్నివేశాలు శృతి మించడం కలిసి వచ్చింది. అందుకే ఆ సినిమా రూ.900 కోట్ల వసూళ్లు నమోదు చేసింది. అదే ఫార్ములను చాలా మంది ఫిల్మ్ మేకర్స్ ఇప్పుడు వాడుతున్నారు. అవసరం ఉన్నా.. లేకున్నా కూడా యాక్షన్ సన్నివేశాలను బలవంతంగా చొప్పించే ప్రయత్నంను చాలా మంది చేస్తున్నారు. వారు ఎంచుకుంటున్న రూటు చూసి నాకు భయం వేస్తుందని అన్నాడు. ఇండస్ట్రీలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులపై ఈ ఇద్దరు దర్శకులు అసహనం వ్యక్తం చేశారు. అనురాగ్ కశ్యప్ నటుడిగా సౌత్ సినిమాలు చేస్తున్నాడు. తెలుగులోనూ ఈయన ఒక సినిమాను చేస్తున్నాడు. ముందు ముందు మరిన్ని సినిమాలు సౌత్‌లోనే చేసే అవకాశాలు ఉన్నాయి.

# ప్రముఖ బౌద్ధ పర్యాటక క్షేత్రం బొజ్జన్నకొండ రహదారి మార్గంలో హెవీ వెహికల్స్, క్వారీ లారీలు, ఇతర ట్రాన్స్‌పోర్ట్ లారీల రాకపోకలకు అనుమతులు లేకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలి

## - సిద్దార్థ సోషల్ సర్వీస్ & కల్చరల్ అసోసియేషన్, అధ్యక్షులు బల్లా నాగభూషణము జిల్లా కలెక్టర్, జిల్లా పోలీసు అధికారులకు, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారులకు విజ్ఞప్తి






**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** స్థానిక సిద్దార్థ సోషల్ సర్వీస్ & కల్చరల్ అసోసియేషన్, రి.అధ్యక్షులు బల్లా నాగభూషణము పత్రికా ప్రకటనలో భాగముగా అనకాపల్లి జిల్లాకే తలమానికం. శంకరంలో గల అతి ప్రాచీన బౌద్ధ పర్యాటక కేంద్రం బొజ్జన్న కొండ ఎంతో ప్రసిద్ధి గాంచిన అత్యంత ప్రాముఖ్యత గల బౌద్ధ క్షేత్రము బొజ్జన్న కొండ అని ఈ మధ్యకాలంలో ఈ బొజ్జన్న కొండను సుమారు 15 కోట్ల 50 లక్షల రూపాయలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సహాయ నిధులతో ఎంతో అద్భుతముగా, అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తూ చక్కని రీతిలో అభివృద్ధి చేయడం, అందులో భాగముగానే సుమారు 3 కోట్ల రూపాయల నిధులతో శంకరం జంక్షన్ నుండి బొజ్జన్న కొండ వరకు గల రోడ్డు మార్గమును ఎంతో ప్రతిష్టాత్మకంగా దృఢముగా చక్కగా నిర్మాణము గావించడం జరిగినది.

అయితే దురదృష్టవశాత్తు ఈ రోడ్డు మార్గము ద్వారానే తుమ్మపాల వరకు గల రోడ్డు మార్గంలో

నిత్యమూ రాత్రనక, పగలనక తేడా లేకుండా వందలాది వెహికల్స్, క్వారీ లారీలు, హెవీ వెహికల్స్, మట్టి లోడ్ లారీలు, ఇతర ట్రాన్స్ పోర్ట్ లోడ్ లారీలు రాకపోకలు సాగిస్తుండటం వలన ఈ రోడ్డు మార్గం పూర్తిగా పాడై పోయి గోతులు పడి అస్తవ్యస్తంగా శిథిలావస్థకు చేరుకొనే అవకాశము ఉండటమే గాక ఈ రోడ్డు మార్గము ద్వారా నిత్యము కూడా సందర్శకులు బొజ్జన్నకొండకు వస్తూ ఉండటం అలాగే సందర్శకులు కార్లు, ద్విచక్ర వాహనములు, ఆటోలు, స్కూల్, కాలేజీ బస్సుల ద్వారా రావడము జరుగుతూ ఉన్నది. అలాగే ఈ రోడ్డు మార్గంలో తుమ్మపాల, పట్టణ వాకర్స్ ఉదయము వాకింగ్ కూడా చేయడం జరుగుతుంది. అయితే ముఖ్యంగా ఇలా హెవీ వెహికల్స్, క్వారీ లారీలు, ట్రాన్స్ పోర్ట్ లారీలు తమ ఇష్టానుసారంగా నిత్యము రాత్రులు, పగలు తేడా లేకుండా రాకపోకలు సాగిస్తుండటం వలన ప్రమాదాలు జరగడటం, ట్రాఫిక్‌కు అంతరాయం కలగటం, సందర్శకులు ఇబ్బందులు పడటం, మనము చూస్తున్న విదిత విషయమని అలాగే తుమ్మపాల నుండి వచ్చే రోడ్డు మార్గము ఇప్పటికే పెద్ద పెద్ద గోతులతో నిండి ఉండి రోడ్డు ప్రమాదములు జరగటమే గాక పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, సందర్శకులు, మార్నింగ్ వాకర్స్ ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఈ సందర్భముగా బల్లా నాగభూషణము తెలియజేశారు. గావున ఈ బొజ్జన్నకొండ ప్రతిష్ఠాత్మకమైన ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఒక గొప్ప బౌద్ధ పర్యాటక కేంద్రం అని ఈ బొజ్జన్నకొండ చుట్టూ గల ప్రాంతాన్ని కాపాడవలసిన బాధ్యత అటు ప్రభుత్వము పైన, ఎంతైనా అవసరం ఉందని బల్లా నాగభూషణము తెలియజేస్తూ ఇప్పటికైనా ఈ బొజ్జన్నకొండ రోడ్డు మార్గం ద్వారా హెవీ వెహికల్స్, క్వారీ లారీలు, అధిక లోడ్‌తో వెళ్లే ట్రాన్స్‌పోర్ట్ లారీలు, ఇతర లారీలకు రాకపోకలకు అనుమతులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్‌కి, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ తుహిన్ సిన్హాకి, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి మనోహర్‌కి, స్థానిక ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వానికి బల్లా నాగభూషణము విజ్ఞప్తి చేశారు.

# గుండుపోటు, గొడ్డలి వేటు, వెన్నుపోటుకు జగన్ రెడ్డికి పేటెంట్ : బుద్ధ నాగ జగదీష్




**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ఆస్తి కోసం తల్లిని చెల్లిని ఇంటి నుండి గెంటివేసి కుటుంబ వ్యవస్థకే వెన్నుపోటు పొడిచాడని, ఐదు సంవత్సరాల పాలనలో 85% ఎన్నికల హామీలను ఎగనామం పెట్టి ప్రజలకు వెన్నుపోటు పొడిచాడని, సొంత బాబాయ్ వివేకానంద రెడ్డి పై గొడ్డలి వేటు వేసి చంపి ఈ జగనాసురుడు, నేరగాళ్లకు, మోసగాళ్లకు గంజాయి ఉత్పత్తిదారులకు కొమ్ము కాసిన వ్యక్తి వెన్నుపోటు గురించి మాట్లాడే అర్హత జగన్ రెడ్డికి లేదని, మాజీ శాసన మండలి సభ్యులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు జగన్ రెడ్డి పై విరుచుకుపడ్డారు. వైసిపి అధినేత జగన్‌రెడ్డి జూన్ 4 వెన్నుపోటు దినంగా పిలుపు ఇవ్వడం చూస్తే ఓటు వేయని ప్రజలపై అక్కసుతో పిలుపు ఇచ్చినట్లు ఉందని, తన పాలనను ప్రజలు తిరస్కరించడానికి ఆయన వెన్నుపోటుగా వర్ణించి ప్రజల్ని దోషులుగా చిత్రించే ప్రయత్నం చేస్తున్నాడని, ప్రజాస్వామ్యంలో ఇంత నీచనికృష్ట దుర్మార్గున్ని చూడలేదని ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారని నాగ జగదీష్ అన్నారు. జే బ్రాండ్ మద్యంతో ప్రజా ఆరోగ్యాన్ని పొట్టను పెట్టుకుని, 30 వేల మంది ప్రాణాలు తీసిన వెన్నుపోటుదారుడు జగన్ రెడ్డిని, ఇసుక, మట్టి, గనులు, గ్రావెల్, భూములు,కబ్జాలతో రాష్ట్రాన్ని యదేచ్ఛగా కొల్లగొట్టిన జగన్ ముఠాను రాష్ట్ర ప్రజలు అధపాతాళానికి తొక్కేరని, జగన్ రెడ్డికి 11 సీట్లకే ప్రజలు పరిమితం చేశారని యువత, ఉద్యోగులు, రైతులు, మహిళలు, విద్యావంతులు, మధ్య తరగతి వారు అందరూ కలిసి అవినీతి అసమర్ధ పాలనకు చరమగీతం పాడారని, ఓటమికి గల కారణాలను సమీక్షించకుండా జగన్ రెడ్డి నేరస్తులను పరామర్శించడానికి జైలు యాత్ర చేస్తున్నాడని జగన్ రెడ్డిని నాగ జగదీష్ ఎద్దేవా చేశారు. నాడు కాంగ్రెస్‌ను అడ్డం పెట్టుకొని లక్షల కోట్లు దోచుకొని కాంగ్రెస్ పార్టీ రాజకీయ జీవితం ఇచ్చిన అదే పార్టీకి వెన్నుపోటు పొడిచి, వైసీపీ పార్టీని స్థాపించాడని, నాగ జగదీష్ అన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 4000 పెన్షన్ పెంచి ఇస్తున్నారని, మెగా డీఎస్సీ ప్రకటన చేసి 16,436 పోస్టులకు ఈ నెలలోనే పరీక్షలు నిర్వహిస్తున్నారని, ఉచిత దీపం పథకం ఇస్తున్నారని, ఆగస్టు నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏర్పాటు చేశారని, జూన్ నెలలో తల్లికి వందనం అర్హులైన అందరికీ 15000 చొప్పున చెల్లించడానికి ప్రభుత్వం చర్యలు, అన్నదాత సుఖీభవ ఈ నెలలోనే రైతులకు విజయవంతం కాబోతుందని, వైసిపి ఐదు సంవత్సరాలు పాలనలో రోడ్లకు చుక్కలు చూపించిన రోడ్లకు 1200 కోట్లు కూటమీ ప్రభుత్వం ఖర్చు పెట్టి 20,000 కిలోమీటర్లు బాగు చేయడం జరిగిందని, మత్స్యకార భరోసా కింద ప్రతి వ్యక్తికి 20,000 చొప్పున 259 కోట్లు అందజేశామని, అనేక పథకాలకు శ్రీకారం చుట్టి అన్ని వర్గాలకు మేలు చేస్తున్నారని, ఒకవైపు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న ఈ నేరస్తులకు కంటికి కనపడలేదని కళ్ళుకు కనబడడం లేదా అని నాగ జగదీష్ జగన్ రెడ్డి ప్రశ్నించారు. ఈ సంవత్సరకాలంలో ప్రజల పక్షాన ఒక్కరోజు కూడా ఆలోచన చేయలేదని ఎంతసేపు నేరస్థులకు కొమ్ముకాస్తూ పరామర్శ పేరుతో విధ్వంసం సృష్టించడానికి రచనలు చేస్తున్నాడని, ఇటువంటి వారిపై ప్రజలు ఒక కంట కనిపెట్టాలని మీ నేరస్తులు మరలా రాకుండా అప్రమత్తంగా ఉండాలని నాగ జగదీష్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బోడి వెంకటరావు కుప్పిలి జగన్ విల్లూరి రమణబాబు బర్నికాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 32 శాతం రేషన్ పంపిణీ పూర్తి : జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** చౌక ధరల దుకాణాల ద్వారా సరుకులు పంపిణీ కార్యక్రమంలో ఇప్పటివరకు 33 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. మంగళవారం ఉదయం స్థానిక 84వ వార్డు కోట్ని వీధిలో గల 15వ నెంబర్ రేషన్ షాపు పరిధిలో రేషన్ పంపిణీపై జిల్లా కలెక్టర్ తనిఖీలు నిర్వహించారు. రేషన్ షాపులో సరుకులు పంపిణీని తనిఖీ చేశారు. సరైన కొలతలతో సరుకులు పంపిణీ చేయాలని డీలర్‌ను ఆదేశించారు. దివ్యాంగులు, కదలలేని స్థితిలో ఉన్న వారికి, వృద్ధులకు ఇంటి వద్దనే సరుకులు పంపిణీ గూర్చి అడిగి తెలుసుకున్నారు, వారందరికీ ఇంటి వద్దనే సరుకులు పంపిణీ చేయాలని, డిజిటల్ పేమెంట్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ రేషన్ షాపు పరిధిలో గల కదలలేని స్థితిలో గల విరోటి నాగయ్యమ్మ, కోట నాగమ్మలకు మరియు వృద్ధులైన చిత్త చంద్రమ్మ, బొడ్డు మంగవేణిలకు వారి ఇంటికి వెళ్లి సరుకులు అందజేశారు. సరుకులు పంపిణీ వ్యవస్థపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు చౌక ధరల దుకాణాల ద్వారా నిత్యవసర సరుకులు పంపిణీ తిరిగి ప్రారంభించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 1069 రేషన్ షాపులు ఉన్నాయని, వాటి ద్వారా ఐదు లక్షల ముప్పై వేల కార్డుదార్లకు సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు 32 శాతం పంపిణీ పూర్తయిందని తెలియజేశారు.

జిల్లాలో దివ్యాంగులు, కదలలేని స్థితిలో ఉన్నవారు, 65 సంవత్సరాలు దాటిన వృద్ధులు సుమారు 66 వేలు మంది ఉన్నారని, వారందరికీ రేషన్ డీలర్లు ఇంటి వద్దనే సరుకులు పంపిణీ చేస్తారని తెలిపారు. వారికి కూడా 32 శాతం మందికి పంపిణీ పూర్తి చేయడం జరిగిందని, రెండు రోజుల లోపల శత శాతం పంపిణీ పూర్తి చేయవలసిందిగా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రతి నెల 5వ తేదీ లోపల మధ్యాహ్నం 12 నుండి 4 గంటల సమయంలో వినియోగదారులకు ఇబ్బంది లేకుండా ఈ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. దివ్యాంగులు, వృద్ధులు జాబితా అందరి రేషన్ డీలర్ల వద్ద ఉం దని వారికి ఇంటి దగ్గరే సరుకులు పంపిణీ జరుగుతుందని, కావున వారు ఇబ్బంది పడి రేషన్ షాపులకు రావద్దని తెలియ జేశారు. రేషన్ సరుకులు పంపిణీలో సమస్యలు, ఇబ్బందులు ఉంటే ఫిర్యాదు చేయాలని జిల్లా కలెక్టర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి షేక్ ఆయిషా, జిల్లా సరఫరా అధికారి కే ఎల్ ఎన్ మూర్తి, తాసిల్దార్ బి విజయ్ కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# పినమడక అంగన్వాడి కేంద్రంలో బాలింతలకు గర్భిణీలకు పోషక ఆహారాలు అందజేసిన 85వ వార్డు ఇంచార్జ్ కార్పొరేటర్ ఇల్లపు ప్రసాద్



**విశాఖ, (రాజధాని వార్తలు):** జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి పునరావస్ కాలనీ పినమడక అంగన్వాడి కేంద్రంలో ఇల్లపు ప్రసాద్ చేతుల మీదుగా బాలింతలకు, గర్భిణీలకు 3 కేజీల బియ్యం, 1 కేజీ కందిపప్పు ,1/2 కేజీ ఆయిల్ ,1 కేజీ అటుకులు, 2 కేజీలు రాగి పిండి, 1/4 కేజీ బెల్లం, 1/4 కేజీ చెక్కి, 1/4 కేజీ ఎండు ఖర్జూరం పోషకాహారాలు మరియు బిఎస్ స్కిట్స్ 25 ఎగ్స్, 5 లీటర్ల పాలు 7 నెలల నుండి 3 సంవత్సరాలలోపు పిల్లలకు ప్రతినెల 25 కేజీలు బాలామృతం, 2 1/2 లీటర్ల పాలు 25 గుడ్లు అందజేయడం జరిగినది. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేయుటకు గాజువాక ఎమ్మెల్యే పల్ల శ్రీనివాసరావుకి లిస్టు ఇవ్వడం జరిగిందని అంగనవాడి టీచర్, హెల్పర్లు బాలింతలకు గర్భిణీలకు సరైన సూచనలు ఇచ్చి సహకరించాలని కోరారు ప్లే స్కూల్లో చదివే పిల్లలకు పాఠశాలలో చేర్చడానికి కృషి చేయాలని కోరారు. 85వ వార్డు టిడిపి ఉపాధ్యక్షులు కడవల రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ సీనియర్ టిడిపి నాయకులు అండబోయిన మంగరాజు జనసేన పార్టీ నాయకులు డాన్స్ దిలీప్ అంగనవాడి టీచర్ ఎస్ సాయి సరస్వతి హెల్పర్ కే సత్యవతి మరియు లబ్ధిదారులైన స్త్రీలు పాల్గొన్నారు.

# నెలల చిన్నారి భార్గవి కుటుంబానికి ఆర్థిక సాయం

## - హాయ్ ఫ్రెండ్స్ సేవ సంఘం 20 వేల రూపాయలు ఆర్థిక సాయం



**శ్రీకాకుళం అర్బన్, (రాజధాని వార్తలు):** శ్రీకాకుళం పెద్దపాడులో నివాసం ఉంటున్న పవన్ కళ్యాణ్ కుమార్తె భార్గవి హార్ట్‌లో రెండు హోల్స్ ఉన్నాయని, వెంటనే ఆ పాపకి సర్జరీ చేయాలని వైద్యులు చెప్పడంతో ఆ నిరుపేద కుటుంబానికి మేమున్నాము అంటూ అండగా హాయ్ ఫ్రెండ్స్ సేవా సంఘం ద్వారా ఒక 20 వేల రూపాయలు సహాయం చేయడం జరిగిందని, హాయ్ ఫ్రెండ్స్ సేవా సంఘం సభ్యులు తెలిపారు. ప్రతి నెల అనారోగ్యంతో ఉన్నవారికి సహాయం చేయడం జరుగుతుందని, దాతలు ఈ చిన్నారిని ఆధునిక, ఉజ్వల భవిష్యత్‌కు సహాయపడాలన్నారు. ఈ కార్యక్రమంలో హాయ్ ఫ్రెండ్స్ సేవా సంఘం కమిటీ సభ్యులు కింతాడ సంతోష్, సీపాన శ్రీనివాసరావు, సర్వేశెట్టి కేశవరావు, పోటో జి.నాగరాజు, కే పురుషోత్తం రావు, ఎస్.శ్రీనివాసరావు, దాడి సంతోష్, బలగ.శ్రీనివాసరావు, జి తారక్, కే హేమంత్, అత్తిలి సతీష్, దాసరి కిరణ్, పి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan